# వాయిదా పడిన కేసు

రోజూ సైన్సు పాఠాలు విని, ప్రాక్టికల్సు చేసి, చేసి జోరెత్తిన బి.యెస్సి ఫైనల్ విద్యార్థులు ఆరోజు కస్తూరిమేడం చెప్పే సాహిత్య పరమైన సంగతులు చాల శ్రద్ధగా వింటున్నారు.

"ఒక జడ్జిగారు మరణించగా ఆయన స్థానంలో తనను నియమించ వలసిందిగా ఒక యోగ్యుడైన ప్లీడర్ దరఖాస్తును సిద్ధం చేసుకుంటాడు. అయితే శవానికి యింకా దహన క్రియలు జరగలేదు, అయినాక యివ్వొచ్చు అనుకొని ఆగుతాడు. అంత్య క్రియలు ముగిసినాక తన దరఖాస్తును యివ్వడానికి వెళ్ళాడు.

ఆ స్థానంలో అప్పుడే ఒకరిని నియమించడం జరిగిందని తెలుస్తుంది. అప్పుడతను ఏడ్వలేక నవ్వలేక నిర్ఘాంతపోయి నిలుచుంటాడు. యిది నేను ఈమధ్య చదివిన ఓమంచి రచన యొక్క జిష్టే అని ముగిస్తుంది మేడమ్.

అరుణ వెంటనేలేచి "మేడం! శవంస్మశానానికి చేరక ముందే ఆ స్థానం తనకురావాలని అంటే తనకు రావాలి అని కొట్లాడుకునే వ్యక్తులు సాహిత్యంలోకాక నిజజీవితంలో ఉంటా రండి." పీరియడ్ ముగిసినట్లు బెల్ అయ్యింది. "మనిషి ఎంత స్వార్థపరుడో మీరు నిజ జీవితంలో అడుగు పెట్టాక తెలుస్తుంది అంటూ బయటికి నడిచిన మేడంను విద్యార్థులు అనుసరించారు.

*　　　*　　　*

బెంచి క్లర్కు కేసుకు సంబంధించిన కాగితాలను జ గారి ముందుంచి అటెండర్ కేదో చెప్పగానే అటెండర్ పబ్లి ప్రాసిక్యూటర్‌ను రావలసిందిగా పిలిచాడు.

బార్ రూంలోవున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ హడావిడిగా హాల్లోకొచ్చి కూర్చున్నాడు.

జడ్జిగారు కాగితాలను పరిశీలించి అంతవరకు తాను నోట్ చేసుకున్న పాయింట్స్‌ను సమీకరించి దాన్ని జడ్జిమెంట్ రూపంలో ప్రకటిద్దామని ముగింపు లైన్స్ రాద్దామని పెన్

కాగితంమీద పెట్టగానే—

అరుణ తరపు అడ్వకేట్‌గారు లేచి జడ్జిగారి వైపు మళ్ళి

"యువరానర్ నాక్లయింట్ తమరికేదో మనవి చేసు కుంటానంటుంది అనుమతి ఇవ్వాల్సిందిగా మనవి."

"ఆర్గ్యుమెంట్స్ అయిపోయాయిగద. యింకేమిటి మనవి చేసేది" అన్నారు జడ్జిగారు కాస్తాముఖాన్ని చిట్లించుకుంటూ.

"అప్పుడు ఆమె చెప్పుకునే సత్తువ లేకుండా పూర్తిగా నరాలు బిగుసుకుపోవడంవల్ల శబ్దం కూడా సరిగ్గా రాలేదు. యిప్పుడు కాస్తాకోలుకుంది. మాట్లాడగలుగుతుంది. దయచేసి అవకాశమివ్వండి." అంటూ బోనులోవున్న తన క్లయింటు వైపు చూసాడు.

"యస్ పరిమిటెడ్" అంటూ జడ్జిగారు రెండు చేతులను గదమ కింద ఆనించి వినడానికి సిద్ధమయ్యాడు.

వంకరపోయిన వేళ్ళతో, ఎక్కడికక్కడ కాలి, గాయాలై మాని, నరాలు గుంజుకుపోయి మెడభాగం అతుక్కుపోయి ముక్కు, నుదురు, చెంపలు, తెల్లమచ్చలయిన ఒహు వికృత రూపం. కాలి ముడుచుకుపోయిన కనురెప్పలక్రింద కాలకుండా మిగిలిపోయిన కనుగుడ్లను కదిలిస్తూ ఒక్కసారి చుట్టుచూసి

ఆ కేసును వాదిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ పై బెంచీలమీద కూర్చున్న తాళికట్టిన తనభర్త కొత్తగా పెండ్లికూతురై అత్త గారింటికి వెళ్ళినప్పుడు హారతిచ్చి బొట్టుపెట్టి తనయింటి కడప లోపల కుడిపాదం పెట్టమన్న అత్త.

పందిళ్ళు వేయించి పదిమందికి తెలిపేటట్టుగ బాజా భజంత్రీలతో ఊరేగింపు తీయించిన మామగారు కూర్చు న్నారు.

తనకు ఆర్థిక సహాయం కల్పించి తన తరపున ఓ అడ్వకేటును పెట్టించిన మహిళా సంఘ సభ్యులు కోర్టుహాలు దర్వాజ దగ్గర బెంచిమీద కూర్చున్నారు.

బోనుపక్కనే తన తల్లి నిలుచుంది. జడ్జిగారివైపు మళ్ళీ చేతులు జోడించి

"అయ్యా నేను చావవలసినదాన్ని ఎట్లా బ్రతికానో, ఎం దుకు బ్రతికానో అర్థం కావడంలేదు. నాకు పిల్లలు కాలేదని గొడ్రాలునని నలుగురిలో అవమానం భరించలేక నాకు నేనే కాల్చుకొని చావాలని చూశానని అత్తగారివాళ్ళ అభియోగం దీనికి పోలీసువాళ్ళ మద్దతు నాకు చావాలని లేదండి. ఈ స్థితిలో యిప్పటికీ బతకాలనే వుంది. నాకేం తక్కువని బి. యస్సీ. వరకు చదువుకున్నాను. అమ్మా నాన్న అందమైన రూపాన్నే యిచ్చారు. కానీ కాపాడి ఆనందించాల్సిన భర్త"-

అప్పుడామె గొంతులో దుఃఖం తన్నుకొచ్చింది. కళ్ళల్లో తిరిగిన నీరు ధారలై కాలిన బుగ్గలమీద నుండి జారుతున్నాయి.

"నా నోటిలో గుడ్డలు కుక్కి నాచేతులను నాభర్త బిగ్గరగా కదలకుండా పట్టుకున్నాడు. తన కొడుకులాంటి, తనలాంటి మనవళ్ళు, మనవరాళ్లను నేను కనిపెంచుతుంటే చూసి ఆనందించాల్సిన అత్త అగ్గిపుల్లను గీసి అంటించింది.''

జడ్జిగారు కదిలి కూర్చుంటూ జారిన కళ్ళద్దాలను సరిచేసుకున్నాడు.

కోర్టులో కూర్చున్న ఆడవాళ్ల కడుపులో చెయిపెట్టి దేవినట్లయి కళ్ళనిండా నీరు ఊరుతుంది. భర్త, అత్త తలలొంచి నేలను చూస్తున్నారు.

మానవత్వం రోధిస్తున్నట్టుగ కోర్టు హాల్లోని గడియారం టంగ్ టంగ్‌మంది. భరించరాని బాధతో సోలుతున్న శరీరాన్ని బోనుకర్రల ఆసరాతో నిలదొక్కుకొని మామగారివైపు చూసి,

"మామగారేమో దానికి మసిపూసి మాయచేసి, నేనేకాల్చుకొని చావాలని నిప్పుపెట్టుకున్నానని పంచనామ రాయించాడు. డబ్బుకు ఆశపడి పోలీసులు ఆత్మహత్యా ప్రయత్నం నేరం కింద నాపైకేసు పెట్టారు.

మనుషుల్లా పుట్టి జంతువుల్లా బ్రతుకుతున్న వాళ్ళు, తమకు కూడా బిడ్డా పాపలున్న వాళ్లూ తాగుడుకు, డబ్బుకు ఆశపడి తప్పుడు సాక్ష్యాలు ఇచ్చారు.

అయ్యా నేను నిర్దోషిని, నేను బ్రతికినా సంసార జీవితానికి పనికిరానని నేను హాస్పిటల్లో వున్నపుడే రెండవ పెళ్ళికి ప్రయత్నాలు మొదలయినాయట. ఆస్తిని, ఉద్యోగాన్ని చూసి పిల్లనిస్తామని పిచ్చి తల్లిదండ్రులు అనడం, చేసుకుంటామని అమాయకపు సోదరీమణులు ఒప్పుకోవడం దురదృష్టం'' అంటూ ఒక్కసారే బరువైన శ్వాసవొదిలి కళ్ళుమూసుకుంది. అప్పుడు క్లాస్ రూంలో కస్తూరిమేడం చెప్పిన మాటలు గుర్తుకురాగా తమాయించుకొని దోషిఅయిన నా భర్తకుకూడా మీరు జైలుశిక్ష విధించవద్దు, మరణశిక్ష అసలొద్దు. నా భర్త వంద సంవత్సరాలు బతుకుతూ మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదని ఆంక్ష విధించండి. ఏ అమ్మాయి ఆయనతో రెండవ పెళ్ళికి ముందుకు రావొద్దు. ఈయనకేకాదు ఈయనలాంటి నరరూప రాక్షసులకు ఎవ్వరూ మళ్ళీ పిల్లనివ్వవద్దు. అసలు ఈ అమాయకురాళ్ళ హత్యలకు కారకులు అత్యాశపరులయిన అత్తామామలు. వీళ్ళ కూతుళ్ళకు కట్నం లేకుండా పెళ్ళిళ్ళు కావాలి. కూతురికాలికి మన్నంటకుండా బతకాలి కానీ కోడలు మూటలతో రావాలి. అందరికీ చాకిరీ చేయాలి లేదా చావాలి యిదెక్కడి న్యాయమో ఆలోచించండి.

ఇలాంటివాళ్ళకు జీవితాంతం కుమిలి చచ్చే జైలుశిక్ష విధిస్తే అత్యాచారాలు తగ్గొచ్చు. పోతే తప్పుడు కేసు బనాయించి అందర్నీ తప్పు దోవన పట్టించే ఆ పోలీసులను కేసు తప్పని తెలిసిన తరువాతనయినా ఏ శిక్ష విధిస్తారో!
మరో తప్పుడు కేసును ప్రతిపాదించకుండా చేయండి.

పత్రికలు కథలు చెప్పినా, సినిమాల్లో హృదయం కదిలించేటట్టు చూపించినా, రేడియోలు గోలచేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. అందుకని నేను ఈ విషయాన్ని ప్రత్యేకించి చాటడానికి ఊర్లు, పట్టణాలు ఈ దేశమంతా తిరిగి అందరికి నారూపాన్ని చూపించి కనువిప్పు కలిగిస్తాను. నాపెండ్లికి మావాళ్ళిచ్చిన మొత్తాన్ని తిరిగి యివ్వవలసిందిగా ఆదేశించండి. అత్తా ఓతల్లే తన బిడ్డ మరొకరింటి కోడలే అందుకే ఈ స్త్రీలోకాన్ని నిలదీసి అడగాలని వుంది" అని అందరివైపు చూసింది.

కూర్చున్న వాళ్ళందరూ ఒక్కసారే శ్వాస వదిలారు. అరుణ భర్త నుదుటికి పట్టిన చెమటను అరిచేతితో అద్దుకున్నాడు అతని గుండె వేగం పెరిగింది.

భయంతో అత్త నోరెండిపోయింది. కాళ్ళల్లో వొణుకు, తుల్లో వొణుకు మొదలయింది.

మామ పరిస్థితి అంతే వుంది.

అంత వరకు శ్రద్ధగా విన్న జడ్జిగారు ఏదో నోట్ చేసుకున్నారు.

కోర్టు హాల్లో కూర్చున్న వాళ్ళందరు ఒక్కసారే కదిలి తలనిండా కదిలే ఆలోచనలతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వైపు చూశారు.

నుదుట చిమ్మిన స్వేదాన్ని కర్చిప్‌తో అద్దుకుని, బిర్రుగైనట్టు అనిపించిన 'టై' ని వొదులు చేసుకున్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారు.

కేసు రేపటికి వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు.